క్లుప్తంగా

దత్తాత్రేయస్వామికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైల దేవస్థానం గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి విశేషపూజలను దేవస్థానం ఈఓ, అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

చేనేత ఐక్య వేదిక అధ్యక్షుడిగా నూలు నాగేశ్వరరావు



వెలుగోడు: జాతీయ చేనేత ఐక్య వేదిక సంఘం శ్రీశైలం నియోజకవర్గ అధ్యక్షుడిగా వెలుగోడు గ్రామానికి చెందిన నూలు నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీలూరి రుషింగప్ప నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావును ఆ సంఘం నాయకులు అభినందించారు. తనపై నమ్మకంతో నియోజకవర్గ బాధ్యతను అప్పగించడం సంతోషంగా ఉందన్నారు.

పంట నమోదు త్వరగా పూర్తిచేయాలి



ఎదురుపాడు వద్ద పంట నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ ఆంజనేయ

కొత్తపల్లి: నిర్దేశించిన సమయంలో ఆర్‌బీకే సిబ్బంది పంట నమోదు ప్రక్రియ పూర్తిచేయాలని ఆత్మకూరు ఏడీఏ బి.ఆంజనేయ సూచించారు. గురువారం మండలంలోని గోకవరం, ఎదురుపాడు, కొక్కెరంచ ఆర్‌బీకే కేంద్రాలను తనిఖీ చేశారు. అదేవిధంగా కొక్కెరంచ గ్రామం సమీపంలో మొక్కజొన్న పంటలను, ఎదురుపాడు గ్రామ సమీపంలో పంటనమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. కొక్కెరంచ సర్పంచు విష్ణువర్ధన్‌రెడ్డి, ఏఓ కె.మహేష్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



రమణమ్మకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానం పరిధిలోని కొత్తపేట వద్ద నివసిస్తున్న రమణమ్మకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.3,50,000 మంజూరైంది. గురువారం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి చేతుల మీదుగా రమణమ్మకు చెక్కును అందజేశారు.

కర్రెమ్మ గుడి ప్రతిష్ఠోత్సవాలు

జూపాడుబంగ్లా: మండలంలోని తర్తూరు గ్రామంలోని దళితవాడలో నిర్మించిన కర్రెమ్మ గుడి ప్రతిష్ఠవేడుకలు గణపతిపూజతో గురువారం ప్రారంభం అయ్యాయి. రూ.10లక్షల తిరుమల-తిరుపతి దేవస్థానం నిధులతో గ్రామంలోని దళితవాడలో శిథిలమైన కర్రెమ్మ గుడిని నూతనంగా నిర్మించారు. ఉదయం గణపతిపూజ, రక్షాబంధనం, పంచగవ్యప్రాసన, యాగశాలప్రవేశం, షోడశస్తంభపూజ, కలశపూజ, మహామంగళ హారతి కార్యక్రమాలు చేపట్టారు. ఈనెల 2న ఉదయం 11.35గంటలకు యంత్ర ప్రతిష్ఠాపన, విగ్రహప్రతిష్ఠ, విశేషపూజలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

ఎలుగుబంటి సంచారం

మహానంది: స్థానిక ఈశ్వర్‌నగర్ కాలనీలో గురువారం రాత్రి ఎలుగుబంటి కలకలం రేపింది. కాలనీవాసులు టపాసులు కాల్చి, కేకలు వేయడంతో అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు తెలిపారు. దీంతో కాలనీ వాసులు భయాందోళనకు గురవుతున్నారు. కాలనీలోని సిద్ధా ఇంటివద్ద మేకల మంద ఉండటంతో గతంలో రెండు సార్లు అక్కడికి వచ్చిందని స్థానికులు తెలిపారు. అటవీశాఖ అధికారులు స్పందించి రక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. విషయం తెలుసుకున్న డీఆర్వో హైమావతి, ఎఫ్‌బీఓ ప్రతాప్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

జెండాను మూలన పెట్టారు



కర్రతో పాటు జెండాను మూలన పడేసిన దృశ్యం

జూపాడుబంగ్లా: పంద్రాగస్టు రోజున జాతీయ పతాకావిష్కరణ పూర్తికాగానే సాయంత్రం సూర్యాస్తమయం లోగా పతాకాన్ని కిందికి దించాలి. కర్రకు కట్టిన పతాకాన్ని తొలగించి భద్రపర్చాల్సి ఉంటుంది. అయితే మండలంలోని తాటిపాడు సచివాలయం వద్ద ఆగస్టు 15న జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అయితే సాయంత్రం జెండాతో సహా కర్రను తీసి, నిర్లక్ష్యంగా ఓ మూలన పడేశారు. గమనించిన కొందరు ఫొటో తీసి సోషల్‌మీడియాలో పోస్టుచేయటంతో పాటు సచివాలయ ఉద్యోగుల నిర్లక్ష్యాన్ని తూర్పారబట్టారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి
- మహిళలకు పెద్ద పీట వేసిన సీఎం వైఎస్ జగనన్న
- శాప్‌చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి
- మార్కెట్ యార్డు చైర్‌పర్సన్‌గా షేక్ రాహత్ ప్రమాణస్వీకారం
- 15 మంది డైరెక్టర్లు ప్రమాణస్వీకారం

నందికొట్కూరు: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచా బ్రహ్మానందరెడ్డి అన్నారు. గురువారం పట్టణ సమీపంలోని చాముండి ఫంక్షన్ హాల్‌లో మార్కెట్ యార్డు చైర్‌పర్సన్‌గా షేక్ రాహత్‌తో పాటు 15 డైరెక్టర్లతో సెక్రటరీ కృష్ణానాయక్ ప్రమాణస్వీకారం చేయించారు. పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, నాయకులు తరలివచ్చారు. ఎంపీ పోచా మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో మహిళలకు 50 శాతం పదవులు కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగనన్నకే దక్కిందన్నారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. తెలుగు దేశంలో పాలనలో రైతుల సమస్యలు పట్టించుకున్న పాపాన పోలేదని మండిపడ్డారు. చంద్రబాబు పాలనలో కరువు కాటకాలతో రాష్ట్ర ప్రజలు తలడిల్లిపోయారని గుర్తు చేశారు.

సీఎం వైఎస్ జగనన్న కోసం ప్రాణమిస్తా

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోసం ప్రాణాలర్పించేందుకు సిద్ధమేనని రాష్ట్ర శాప్ మాజీ చైర్మన్, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. రాష్ట్రస్థాయిలో గుర్తింపు రావడానికి నియోజకవర్గ ప్రజలు, సీఎం వైఎస్ జగననే కారణమని చెప్పారు. కష్టమైన, నష్టమైన జగనన్నతోనే ముందుకు సాగుతానన్నారు. జగనన్న పాలనలో చేసే పనులను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని పిలుపునిచ్చారు. పట్టణంలో రూ. 30 కోట్లతో అభివృద్ధి చేస్తే టీడీపీ నేతల కళ్లకు కనిపించలేదని ప్రశ్నించారు. ఎక్కడో ఇతర రాష్ట్రంలో ఉంటూ అసైన్డు భూముల పంచాయతీలు చేసుకునే వాళ్లకు నియోజకవర్గ అభివృద్ధి ఎలా తెలుస్తుందని ధ్వజమెత్తారు. రెండు ఇండోర్ స్టేడియాలు, ఏబీఎం పాలెంలో కూడా పార్కు, సీసీ రోడ్లు, కేసీ కెనాల్‌పై నిర్మించే బ్రిడ్జిలు టీడీపీ నాయకులకు కనిపించడం లేదంటూ మండిపడ్డారు. దేశంలో మరెక్కడా లేని ప్రతి కార్యక్రమంలోనూ మహిళలకే పెద్ద పీట వేస్తూ వారికే నేరుగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని స్పష్టం చేశారు. రాజకీయంగా, సామాజికంగా మహిళలకు ప్రత్యేక స్థానం కల్పించారని చెప్పారు.

వైఎస్సార్ బాటలో జగనన్న

వైఎస్సార్ ఆశయాలను నెరవేర్చేందుకు సీఎం వైఎస్ జగనన్న తండ్రి బాటలో పయనిస్తూ సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బంపర్ మెజార్టీ గెలుస్తుందని చెప్పారు. నియోజకవర్గం గురించి ఆలోచించే నాయకుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డేనన్నారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం యువనేత తపన పడుతుంటారని గుర్తు చేశారు.

మైనార్టీలకు పెద్దపీట

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం మైనార్టీలకు అన్ని రంగాల్లో పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్సీ ఇసాక్ బాషా అన్నారు. రాజకీయంగా ఉన్నత పదవులు కేటాయించి సముచిత స్థానం కల్పిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, ఎంపీపీలు మురళీకృష్ణారెడ్డి, మల్లేశ్వరి, వెంకటేశ్వరమ్మ, సువర్ణమ్మ, జెడ్పీటీసీలు యుగంధర్‌రెడ్డి, సోమల సుధాకర్‌రెడ్డి, జగదీశ్వర రెడ్డి, దివ్య, మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రమౌళి, శివరామకృష్ణారెడ్డి, లోకేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న షేక్ రాహత్ , చిత్రంలో శాప్ చైర్మన్ సిద్ధార్థరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా



మాట్లాడుతున్న ఎంపీ పోచా, చిత్రంలో కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ తదితరులు



హాజరైన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

పెళ్లిలో అక్కాచెల్లెళ్ల ఘర్షణ

మహానంది: పెళ్లికి అందరూ వచ్చారు, సంతోషంగా మాట్లాడుకుంటుండగా అక్కాచెల్లెళ్ల మధ్య మాటా మాటా పెరిగి మనస్పర్థలు రావడంతో ఘర్షణ చోటుచేసుకున్న ఘటన మహానందిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ తెలిపిన వివరాల మేరకు...అవుకు మండలం రామాపురం గ్రామానికి చెందిన ఓ జంటకు బుధవారం మహానందిలో వివాహం జరిగింది. వివాహంలో అక్కాచెల్లెళ్ల మధ్య జరిగిన మాటల్లో మనస్పర్థలు రావడంతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఘర్షణలో గాయపడిన నంద్యాల పట్టణానికి చెందిన గీత ఫిర్యాదు మేరకు లక్ష్మి, హరిత, శ్రీలేఖ, కుమార్‌తో పాటుమరొకరిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఘర్షణ కేసులో విచారణ

మహానంది: తిమ్మాపురం గ్రామంలో ఇరు వర్గాలకు చెందిన యువకుల మధ్య జరిగిన ఘర్షణలో పోలీసులు ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. గ్రామానికి చెందిన కొంత మంది యువకుల మధ్య గతంలో ఉన్న మనస్పర్థలు ఘర్షణకు దారి తీయగా.. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గ్రామానికి చెందిన ఓ యువకుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి

నందికొట్కూరు రూరల్ : మండలంలోని గ్రామీణ ప్రాంతాల మహిళలు, యువతులు కృషి విజ్ఞాన కేంద్రం వారు నిర్వహించే ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని శాతనకోట గ్రామ సర్పంచ్ జనార్దన్‌గౌడ్ తెలిపారు. ఆసక్తి కలిగిన మహిళలు మండల కేంద్రంలోని కేవీకే శిక్షణ కేంద్రంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

- నీటిపారుదల శాఖ అధికారులకు ఎమ్మెల్యే ఆర్థర్ ఆదేశం
- ప్రాముఖ్యత పనులకు ప్రతిపాదనలు తయారు చేయాలని సూచన

పగిడ్యాల: నీటి పారుదల శాఖ అధికారులు రైతులకు ఇబ్బందులు కలిగించరాదని, పంటలను కాపాడేందుకు మానవతా దృక్పథంతో పనిచేయాలని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ సూచించారు. గురువారం స్థానిక సచివాలయం-2 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఇంటింటీ వెళ్లి సంక్షేమ బావుటా పుస్తకాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను సంబంధిత శాఖల అధికారులకు నోట్ చేసుకోవాల్సిందిగా ఆదేశించారు. గడప గడపలో వచ్చిన సమస్యల్లో అత్యంత ప్రాధాన్యత సమస్యలకు ప్రతిపాదనలు తయారు చేసి త్వరలో పంపాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. ముచ్చుమర్రి ఎత్తిపోతల నుంచి ఎన్ని రోజులు నీటి సరఫరా కొనసాగిస్తారని ఏఈ నరేష్‌ను ప్రశ్నించారు. దీంతో స్పందించిన ఏఈ మరో మూడు రోజులు మాత్రమే వస్తాయని సమాధానం చెప్పారు. మళ్లీ సాగు నీటి కోసం రైతులు రోడ్లు ఎక్కి ధర్నాలు చేయకుండా సేవలు అందించాలని సూచించారు. అనంతరం పాలమర్రి పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణ, ఇన్‌చార్జ్ తహసీల్దార్ సూర్యప్రకాష్, ఎంఈఓ సుభాన్, ఏఓ విజయ్‌జ్యోతుకుమార్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సగినేల రమణ, హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రమాదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు జయప్రకాష్, జయరామిరెడ్డి, చిట్టిరెడ్డి తదితరులు ఉన్నారు.



మహిళల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

అగ్నిప్రమాద బాధితులకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం

- 14 షాపులు పూర్తిగా దగ్ధం
- రూ. కోటికి పైగా ఆస్తినష్టం

శ్రీశైలం: శ్రీశైల దేవస్థానం పరిధిలోని లలితాంబికా షాపింగ్ కాంప్లెక్స్‌లో బుధవారం అర్ధరాత్రి (గురువారం తెల్లవారుజామున) షార్ట్‌సర్క్యూట్ కారణంగా 14 షాపులు పూర్తిగా దగ్ధం అయ్యాయి. ఆస్తి నష్టం రూ.కోటికి పైగా ఉండవచ్చునని అంచనా. శ్రావణమాసం కావడంతో నిల్వ ఉంచుకున్న వస్తు సామగ్రి పూర్తిగా అగ్నికి ఆహుతి కావడంతో దుకాణదారుల్లో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. విషయం తెలుసుకున్న వెంటనే శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈఓ ఎస్‌లవన్న, తహసీల్దార్ రాజేంద్రసింగ్, ట్రస్ట్‌బోర్డు సభ్యులతో కలిసి పరిశీలించి బాధితులను పరామర్శించారు. తన వంతుగా తక్షణ సహాయం కింద రూ.20 వేల చొప్పున 14 షాపులకు రూ.2.80 లక్షలను అందజేశారు. అలాగే రెండేళ్లపాటు వారి నెలసరి అద్దెను కూడా బాధితుల అభ్యర్థనమేరకు రద్దు చేసేందుకు దేవదాయ మంత్రి, కమిషనర్, ఈఓలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. 10 రోజుల్లోగా 14 దుకాణాలను పునర్నిమించి ఇవ్వాల్సింగా ఈఓ ఎస్ లవన్నను ఆదేశించారు. షార్ట్‌సర్క్యూట్ ఎలా జరిగి ఉంటుందన్న విషయంపై ఆరా తీస్తే ఆ పక్కనే ఉన్న కరెంట్ పోల్ నుంచి దుకాణాలకు విద్యుత్ సరఫరా అయ్యే వైర్ ద్వారా షార్ట్‌సర్క్యూట్ జరిగి ఉండవచ్చునని వ్యాపారస్తులు ఎమ్మెల్యేకి తెలిపారు. ఎల్ బ్లాక్ పక్కనే పార్క్ చేసి ఉన్న ఒక మోటర్ వెహికల్‌తో పాటు మంటల ధాటికి షాపులకు ఎదురు లైన్‌లో నీళ్లతో నిండిన సింటెక్స్ ట్యాంక్‌కూడా కరిగిపోయింది. సకాలంలో స్పందించిన దేవస్థానం అధికార సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది మిగిలిన షాపులకు మంటలు వ్యాపించకుండా అదుపు చేయడం పట్ల వారిని అభినందించారు.



అగ్నిప్రమాదంలో దగ్ధమైన రాగి సామగ్రిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శిల్పా, ఈఓ తదితరులు



ఇనుప షటర్, సామగ్రి దగ్ధమవుతున్న దృశ్యం





అగ్నిప్రమాదంలో పూర్తిగా దగ్ధం అయిన వస్తు సామగ్రి

సత్యాన్ని నమ్ముకున్న వారి వెన్నంటే విజయం

జూపాడుబంగ్లా: సత్యాన్ని నమ్ముకొన్న వారికి ఎల్లప్పుడు విజయం వారి వెన్నంటే ఉంటుందని టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లాల కార్యనిర్వాహకులు మల్లువెంకటరెడ్డి తెలిపారు. గురువారం రాఖీపౌర్ణమిని పురస్కరించుకొని పారుమంచాల గ్రామంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హిందూధర్మం అద్వితీయమైనదన్నారు. ధర్మం తప్పి నడిచేవారు వారి కర్మఫలితాన్ని తప్పక అనుభవించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టు చైర్మన్ నర్రెద్దుల శ్రీనివాసరెడ్డి, సేవాబృందం సభ్యులు మందడి కరుణాకర్‌రెడ్డి, మండ్ల పాలరాము, పోచా లోకేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భక్తులకు శ్రీసత్యనారాయణ స్వామి వ్రత మహిమను తెలియజేస్తున్న మల్లువెంకటరెడ్డి

నేటి నుంచి భూముల రీసర్వే

మహానంది: మహానంది, బండిఆత్మకూరు మండలాల్లో శుక్రవారం నుంచి భూముల రీ సర్వే నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్లు జనార్దన్‌శెట్టి, రవికుమార్ తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ.. మహానంది మండలంలోని బొల్లవరం, గోపవరం, బండిఆత్మకూరు మండలంలోని కడమలకాల్వ, నారాయణాపురం, జీసీ పాలెం, రామాపురం, ఈర్నపాడు, భోజనం, సంతజూటూరు, బండిఆత్మకూరు గ్రామాల పరిధిలో సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. రైతులు డాక్యుమెంట్లతో హాజరు కావాలని ఆయన కోరారు. రైతుల సరిహద్దులను చూపించాలని, ఓఆర్‌ఐలో ఎంటర్ చేసి తర్వాత రికార్డులు తయారు చేస్తారన్నారు. రైతులకు ముందురోజే తలారుల ద్వారా నోటీసులు అందిస్తామన్నారు.

రైతులు సహకరించాలి

జూపాడుబంగ్లా: సమగ్ర భూ సర్వే కార్యక్రమానికి రైతులు, ప్రజలు సహకరించాలని తహసీల్దార్ పుల్లయ్యయాదవ్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలోని తర్తూరు, మండ్లెం, తూడిచెర్ల, ఘణపురం, 80బన్నూరు, తంగడంచ, తరిగోపుల, గ్రామాలు మూడో విడతగా సమగ్రభూ సర్వే కార్యక్రమానికి ఎంపికైనట్లు తెలిపారు.

అతివేగంతో ప్రాణాలమీదికి తెచ్చుకోవద్దు

మహానంది: అతివేగం ప్రాణాలమీదికి తెస్తుందని, వాహనాలు నడిపేవారు నిదానంగా వెళ్లాలని మహానంది ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ సూచించారు. నంద్యాల-గిద్దలూరు నల్లమల ఘాట్‌రోడ్డులోని గాజులపల్లె సమీపంలో గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. సరైన పత్రాలు లేని వాహనదారులకు రూ. 2,700 జరిమానాలు విధించారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

అల్లర్లకు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని మహానంది ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ హెచ్చరించారు. ఆంజనేయపురం గ్రామంలో గురువారం పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టారు. ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ గ్రామాల్లో అల్లర్లు, గొడవలు సృష్టించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

సమస్యల పరిష్కారానికి 'సమరభేరీ'

ఆత్మకూరు: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసమే సమరభేరీ ఇంటింట ప్రచార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీపీఎం పట్టణ కార్యదర్శి రణధీర్ , రామ్‌నాయక్ అన్నారు. గురువారం పట్టణంలోని ఇందిరానగర్‌కాలనీలో కరపత్రాలు పంచుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు

89 కొత్త పింఛన్లు మంజూరు

కొత్తపల్లి: మండలంలో 89 మందికి కొత్త పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ మేరి గురువారం తెలిపారు. శుక్రవారం నుంచి పాత పింఛన్ దారులతో పాటు కొత్త లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తారన్నారు. మండలంలో ఆయా గ్రామాలలో 4,236 మంది పింఛన్‌దారులు ఉన్నారని తెలిపారు. ఇందులో పాతవి 4,147 పింఛన్లు ఉన్నాయన్నారు.

ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి సన్మానం

ఆత్మకూరు: పట్టణంలో గురువారం ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డిని ఇటీవల నూతనంగా ఎంపికైన వైఎస్సార్‌సీపీ నూతన జిల్లా కార్యదర్శి తిమోతి దుశ్శాలువా, పూలమాలలతో సన్మానించారు. తన సేవలను గుర్తించి, తనపై నమ్మకం ఉంచి జిల్లా కార్యదర్శిగా నియమించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్‌మీర్, పాస్టర్లు సుధాకర్, ప్రభాకర్, సురేష్, ప్రతాప్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వెలుగోడు: వేల్పనూరు ఎంపీటీసీ సభ్యుడు బన్నూరు తోయ జనాభారెడ్డి నంద్యాలలో నూతనంగా నిర్మించుకున్న గృహ ప్రవేశం కార్యక్రమానికి ఎమ్మెల్యే శిల్పా, నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వర్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు.



ఎమ్మెల్యే శిల్పాను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి తిమోతి, పాస్టర్లు

రైతులందరూ తప్పనిసరిగా హాజరు కావాలి

కొత్తపల్లి: మండల కేంద్రంలో శుక్రవారం జరగనున్న గ్రామసభకు గ్రామంలోని రైతులందరూ హాజరు కావాలని తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్ గురువారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎటువంటి భూ సమస్యలు తలెత్తకుండా చేసేందుకు జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష పథకం అమలు చేస్తుందన్నారు. స్థానిక సచివాలయం వద్ద నిర్వహించే గ్రామసభలో రైతులు భూ రీసర్వేపై ఏమైన అనుమానులు ఉంటే నివృత్తి చేసుకోవాలని సూచించారు.

ఎర్రమఠం మాజీ సర్పంచ్ మృతి



నరసింహుడు(ఫైల్)

కొత్తపల్లి: మండలంలోని ఎర్రమఠం గ్రామ మాజీ సర్పంచు గొల్ల.నరసింహుడు(72) గుండెపోటుతో గురువారం మృతి చెందారు. కుటుంబ సభ్యుల వివరాలమేరకు.. గురువారం ఉదయం తన పొలంలో వేసిన మిరప పంటను చూసుకొని ఇంటికి చేరుకున్న తరువాత ఉన్నఫలంగా కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆత్మకూరు పట్టణంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న శాప్‌చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, మాజీ ఎమ్మెల్యే లబ్బివెంకటస్వామి, వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు చంద్రమౌళి గ్రామానికి చేరుకొని మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబా న్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసానిచ్చారు.

పురుగు మందు తాగి రైతు ఆత్మహత్య

పాములపాడు: మండలంలోని రుద్రవరం గ్రామంలో వెంకటనాగులు (73) అనే రైతు పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం చోటు చేసుకుంది. కుటుంబీకులు తెలిపిన వివరాల మేరకు.. మృతుడు సొంత పొలం 2 ఎకరాలతో పాటు మరో 3 ఎకరాలు కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. ఇప్పటికే దాదాపు రూ.7లక్షలు అప్పు ఉందని, ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల వల్ల పంట చేతికందే పరిస్థితి లేకపోవడంతో మనస్తాపానికి గురై మద్యంలో పురుగుల మందు కలుపుకొని తాగాడు. విపరీతంగా వాంతులు చేసుకుంటుండంతో భార్య లక్ష్మీదేవి ఆత్మకూరు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్స నిర్వహించిన అనంతరం అంబులెన్స్‌లో కర్నూలుకు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. మృతుడి భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అశోక్ తెలిపారు మృతుడికి ఇద్దరు కుమారులు, కూమార్తె ఉన్నారు.

విద్యుత్ సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తా

జూపాడుబంగ్లా: విద్యుత్ కోతల విషయాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఇబ్బందుల్లేకుండా చేస్తానని శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి రైతులకు హామీ ఇచ్చారు. విద్యుత్‌కోతలను నిరసిస్తూ మండ్లెం గ్రామానికి చెందిన రైతులు గురువారం సాయంత్రం మండ్లెం విద్యుత్ ఉపకేంద్రం వద్ద కేజీ రోడ్డుపై ధర్నా చేయటంతో వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. అదే సమయంలో నందికొట్కూరు నుంచి విజయవాడ వెళ్తున్న శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి వాహనాల రాకపోకలు స్తంభించిపోయి ఉండటాన్ని గమనించి వాహనం దిగి రైతుల వద్దకు చేరుకున్నారు. వారి సమస్యను ఆలకించారు. విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి రైతులకు అంతరాయం లేకుండా విద్యుత్‌సరఫరా చేసేలా చేస్తానని భరోసా నివ్వటంతో రైతులు శాంతించి ధర్నాను విరమించారు.



రైతులతో మాట్లాడుతున్న శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

పగటి వేళల్లోనే విద్యుత్ సరఫరా చేయాలి

పగిడ్యాల/మిడుతూరు: వ్యవసాయానికి సరఫరా చేసే విద్యుత్‌ను పగటి వేళల్లోనే నిరంతరాయంగా సరఫరా చేయాలని గురువారం సాయంత్రం రైతులు స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని పగిడ్యాల, లక్ష్మాపురం, పడమర ప్రాతకోట గ్రామాలకు చెందిన రైతులు అధిక సంఖ్యలో తరలి వచ్చి నిరసన చేపట్టారు. అలాగే మిడుతూరు మండలంలోని రోళ్లపాడు విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని రైతులు విద్యుత్ ఉపకేంద్రం వద్దకు చేరుకొని ధర్నా నిర్వహించారు.

గ్రామాల్లో రీ సర్వేపై అవగాహన

మిడుతూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో రీ సర్వేపై అవగాహన కల్పించేందుకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ప్రకాష్ బాబు తెలిపారు. రైతులు తమ ఆధార్ కార్డుతోపాటు బ్యాంకు అకౌంట్ పుస్తకం, పట్టదారు పాస్ పుస్తకం తీసుకొని గ్రామ సభలకు హాజరుకావాలని సూచించారు.

ఉపాధి పనులపై సోషల్ ఆడిట్

జూపాడుబంగ్లా: మండలంలో రూ.6.09 కోట్లతో చేపట్టిన 791 పనులపై సామాజిక తనిఖీ బృందం సోషల్ ఆడిట్ చేపట్టినట్లు ఏపీఓ గౌరీబాయి తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 1 ఏప్రిల్ 2022 నుంచి 1 మార్చి 2023 వరకు మండలంలోని 12 గ్రామపంచాయతీల్లో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ బృందం ఎస్సార్పీ నీలకంఠ అధ్వర్యంలో 9 మంది డీఆర్పీలు గ్రామాల్లోని క్షుణ్ణంగా తనిఖీ చేసి వాస్తవాలను బహిరంగ సభలో వెల్లడిస్తారని తెలిపారు. సామాజిక తనిఖీ బృందానికి ఉపాధి కూలీలు, సిబ్బంది, అధికారులు సహకరించాలని కోరారు.

వైభవంగా మహాలక్ష్మియాగం



.మహాలక్ష్మి యాగం నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది: శ్రావణమాసం, పౌర్ణమి, గురువారం సందర్భంగా మరకతలింగేశ్వరస్వామి ఆలయంలో మహాలక్ష్మియాగం వైభవంగా జరిగింది. గాజులపల్లె రైల్వేస్టేషన్ గ్రామంలో వెలిసిన శ్రీ గంగా, గౌరీసమేత మరకతలింగేశ్వర, నవగ్రహాల దేవాలయాల్లో ఆలయ వ్యవస్థాపకులు కసమర్ల పూడి మస్తాన్‌రావు ఆధ్వర్యంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు యాగం, స్వామివారికి మహారుద్రాభిషేకం, అమ్మవారికి సహస్రనామ కుంకుమార్చన పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, కూరగాయల దాత టి.ప్రసాద్ పూజల్లో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కలియుగనాథుని కల్యాణం

జూపాడుబంగ్లా: మండలంలోని తాటిపాడు గ్రామంలో శ్రీవీరభద్రస్వామి సేవాసమితి సభ్యులు, భక్తులు శ్రీవెంకటేశ్వరస్వామివారి కల్యాణాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి వారి ఉత్సవ విగ్రహాలను పన్నీటితో స్నానం చేయించి పంచామృతాభిషేకాలు చేయించారు. నూతన పట్టువస్త్రాలతో స్వామి, అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి శాస్త్రకంగా మాంగల్యధారణచేయించారు.

అమ్మవారికి మణిద్వీప వర్ణన పూజలు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో గురువారం అమ్మవారికి మణిద్వీప వర్ణన పూజలు నిర్వహించారు. 33 మంది మహిళలు 33 రకాల ప్రసాదాలు, 33 రకాల పూలు, 33 రకాల పండ్లతో 33 సార్లు ద్వీప వర్ణన పఠనం చేశారు. ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ మహిళా విభాగం నాయకురాళ్లు ఆదిలక్ష్మి, పోలూరి సౌజన్య, అయితా హైమావతి, కొవ్వూరి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.